# ఉత్తరం

**విశాలాక్షికి టెన్షన్ ఎక్కువైపోతోంది. పెళ్లి ఎలా అవుతుందో... పెళ్ళి చూపులంటూ తతంగం అయింది గానీ... ఏమిటో... వాళ్లు పిల్లని సరిగ్గా చూసేరో లేదోనని!**

ఆమె ఆ పనీ ఈ పనీ చేస్తున్నా; కూతురి పెళ్లి గురించిన ఆలోచనలన్నీ కందిరీగల్లా మనసులో పరిభ్రమిస్తున్నాయి.

ఆ రోజు వాళ్లొచ్చేసరికి పవర్ కట్ టైము! విశాలాక్షి తనే స్వయంగా సోఫాలు అవీ మరోసారి దులిపి శుభ్రం చేసింది. ఫ్లవర్ వేజ్‌లోని ప్లాస్టిక్ పువ్వుల్ని శుభ్రం చేసి మళ్లీ వేజ్‌లో సర్దింది. ఎమర్జెన్సీ లైట్ సిద్ధంగా పెట్టింది. వచ్చినవాళ్లకివ్వడానికి ఫలహారాలూ, పళ్లూ అన్నీ ముందే తెప్పించి ఉంచింది.

పెళ్లికొడుకు కళ్యాణ్, అతని అక్క, బావ; వచ్చేరు పెళ్లి చూపులకి. కళ్యాణ్ ఢిల్లీలో ఉంటున్నాడు. అక్కా, బావ వాళ్లు వరంగల్‌లో వుంటున్నారు.

వాళ్లని చూడగానే విశాలాక్షి గుండె ఉద్వేగంతో వేగంగా కొట్టుకో సాగింది. కూతురికి ఎన్నో పెళ్లిచూపులయేయి!

వెళ్లేక ఉత్తరం రాస్తామని ఏడాది క్రిందట చెప్పి వెళ్లినవాళ్లు యిప్పటిదాకా ఏమీ వ్రాయలేదు. వెళ్లేక ఫోన్ చేసి చెప్తామండీ అన్నవాళ్లూ అంతే. ఇలా ఎన్నో... అదేం ఖర్మోగాని కొంత మందయితే పెళ్లిచూపుల్లోనే బేరాలు మొదలు పెట్టేరు ఇచ్చిపుచ్చు కోడాల్ని గురించి. ఇహ వీళ్లేం చేస్తారో దేవుడా?! "ఈ సంబంధం అయినా కుదిరితే బాగుణ్ణు దేవుడా" అని మనసులోనే దేవుడ్ని ప్రార్థించింది.

"పగలు వచ్చివుంటే బాగుండేది. ఇప్పుడు సరిగ్గా పవర్‌కట్ టైమ్" నొచ్చుకుంటూ అంది విశాలాక్షి.

"సాలార్‌జంగ్ మ్యూజియం, చార్‌మినార్... అవీ చూసి వచ్చేసరికి ఆలస్యమయి పోయింది" అన్నారు వాళ్లు.

"ఫర్వాలేదు లెండి, మరేం చేస్తాం" అంది విశాలాక్షి కూతుర్ని వెంట తీసుకువస్తూ.

ప్రమీల పెళ్లికొడుక్కి ఎదురుగా వున్న సోఫాలో కూర్చుంది.

కళ్యాణ్ ప్రమీల వైపు చూసేడు.

సరిగ్గా అదే టైమ్‌లో ప్రమీల కళ్యాణ్ వైపు చురుగ్గా చూసింది.

ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

ఆ చూపులు ఏ మౌనభాషను మాట్లాడుకున్నాయో వాళ్లిద్దరికే తప్ప మరెవ్వరికీ తెలీదు.

పెళ్లిచూపులకి ముందే అతను వ్రాసిన ఉత్తరం ప్రమీల అప్పటికే చాలాసార్లు చదువుకుంది. కాని ఆ ఉత్తరం గురించి ఆమె యింట్లో ఎవ్వరికీ చెప్పలేదు.

కళ్యాణ్ బాగా కనిపించేడు విశాలాక్షి కళ్లకి.

ప్రమీల వాళ్లకి నచ్చినట్టే ఉంది.

"మీ అమ్మాయి మాకు నచ్చిందండి. మాకు కట్నం అక్కర్లేదు. జాతకాల పట్టింపులు లేవు. మీకున్నది ఒక్కర్తే కూతురు. కాబట్టి మీరు మీ అమ్మాయికి ఏ లోటూ చెయ్యరని మేం అనుకుంటున్నాం" అన్నారు వాళ్లు.

విశాలాక్షి భర్త సీతాపతి బ్యాంక్ మేనేజరు. కూతురి పెళ్లిచూపుల టైముకి వుందామని అనుకున్నాడు కానీ దగ్గర్లో వున్న చిన్న బ్రాంచ్‌కి ఇన్‌స్పెక్షన్‌కి వెళ్ళవలసి వచ్చింది. వచ్చేసరికి చాలా రాత్రయి పోతుంది. ఆ మర్నాడు ఉదయం పెళ్లిచూపులు ఏర్పాటు చేద్దామంటే పెళ్లికొడుకు అక్కా, బావా ఒప్పుకోలేదు. మా తమ్ముడికి సెలవు లేదు, వెళ్లిపోవాలి... అంటూ తొందర చెయ్యడంతో పవర్‌కట్ టైముకి పెళ్లిచూపులు తప్పలేదు. ఉన్న ఒక్క కొడుకు రాజశేఖరం కలకత్తాలో ఉద్యోగం చేస్తున్నాడు...

పెళ్లివారు కరెంట్ వచ్చినదాకా కూడా కూర్చోకుండా యింకా ఎక్కడికో వెళ్లాలంటూ మర్యాదలు పూర్తిచేసుకుని లేచి వెళ్లిపోయేరు.

అమ్మాయి వాళ్లకి నచ్చిందని చెప్పగానే విశాలాక్షి సంతోషంతో ఉక్కిరిబిక్కిరయింది. ముహూర్తాలు దగ్గర్లోనే పెట్టించమని వెళ్ళేరు. ఇహ ఆలస్యం చేస్తే ఈ సంబంధం కూడా తప్పిపోతుందేమోనని వాళ్లు అన్నప్రకారంగానే పురోహితుడ్ని పిలిపించి దగ్గర్లోనే ముహూర్తం పెట్టించేరు.

పెళ్లి ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోతున్నాయి. ఆ యింటికి అప్పుడే పెళ్లికళ వచ్చేసింది. శుభలేఖలు ప్రింటయి రావడం, వాటికి పసుపు అంటించి పోస్ట్ చేయడం అయిపోయింది. పై వూళ్లల్లో వున్న దగ్గర బంధువులందరికీ ముందుగానే పెళ్లికి రమ్మనమని ఉత్తరాలు వెళ్లిపోయాయి. ఊర్లో వున్న తెల్సినవాళ్లకి సగంకి పైగా పెళ్లి పిలుపులు అయిపోయాయి. పెళ్లి యింకా పది రోజులుంది. బట్టలెన్ని పెట్టాలి, బంగారం ఎంత పెట్టాలి - అన్నీ నిర్ణయాల ప్రకారం సిద్ధం అయ్యాయి.

విశాలాక్షి తరపు బంధుబలగం అందరూ వారు పీరనకుండా అంతా వచ్చేశారు. విశాలాక్షికి హడావుడి హడావుడి. ఆవిడకి పట్టుచీరల మీద ఆసక్తి లేదు. అమ్మాయి పెళ్లి ఎలా అవుతుందా అని బెంగ మాత్రం పట్టుకుంది. తన కూతురని కాదుగాని ప్రమీల నిజంగా చక్కని చుక్క. బంగారు బొమ్మలా ఉంటుంది. చాలా బుద్ధిమంతురాలు. అలాంటిది... ఎన్ని సంబంధాలొచ్చినా తప్పిపోవడానికి ఒక బలమైన కారణం ఉంది. అది... ఆమె జాతకంలో వున్న కుజ దోషం! వాళ్ల అదృష్టం బాగుండి యిన్నాళ్లకు అసలు జాతకాల పట్టింపే లేనివాళ్లు దొరికారు. అది పెద్ద వరం! పైగా పెళ్లికొడుకు కళ్యాణ్ బి.ఇ. తర్వాత ఎమ్.బి.ఎ. చేసి ఢిల్లీలో ఓ కంపెనీలో ఫైనాన్స్ మేనేజర్‌గా మంచి పోస్ట్‌లో ఉన్నాడు... ఇంట్లో వున్న ఆడవాళ్లంతా ఒక దగ్గర చేరి... ఎదురు సన్నాహం సమయంలో ఏ పట్టుచీర కట్టుకోవాలి. భోజనాలప్పుడు ఎలాంటి చీర కట్టుకోవాలి... అని నిర్ణయాలు చేసేసుకుంటున్నారు.

"అక్కా! పెళ్లికి ఎంతమంది వస్తారని అనుకుంటున్నారే!" అడిగింది విశాలాక్షి చెల్లెలు పంకజం.

"మొత్తం వెయ్యిమందిదాకా అవుతారు".

"మరి నువ్వు లగ్నం టైమ్‌లో ఏ పట్టుచీర కట్టుకుంటావక్కా?"

"అబ్బ! ఏదోలేవే. ఆ టైమ్‌కి ఏది తోస్తే అది. అయినా వచ్చినవాళ్లు పెళ్లికూతుర్ని చూడడానికి వస్తారు కాని నన్ను చూడడానికి కాదుకదా. నేనెలా వుంటేనేమిటి?" అంది ఆవిడ నవ్వుతూ. ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటూ.

"అదేంటక్కా! కన్యాదానం చేసేటప్పుడు... ముందునుంచీ పీటల మీద ప్రమీల పక్కన కూర్చునేది నువ్వూ... బావే కదా. నువ్వు... యింకా స్పష్టంగా అందరికీ అగుపిస్తావు. నువ్వే మంచి పట్టుచీర కట్టుకోవాలి తెల్సిందా!' అంది పంకజం ఆ విషయాన్ని వదిలిపెట్ట కుండా.

"అదికాదు వదినా! వీడియో తీస్తారు కదా. అంతా సినిమా టైపులో తీస్తారట! మనం కట్టుకునే చీర అంచుల మీద వున్న ముడతల దగ్గర్నుంచి స్పష్టంగా పడతాయి. అందుకే మేమందరం యిప్పట్నుంచే ఎప్పు డేచీర కట్టుకోవాలో అని వేరే తీసి పెట్టుకుంటున్నాం" అంది చిన్నాడబడుచు నీరజ పట్టుచీరలు వేరే సూట్‌కేస్‌లో పెడ్తూ.

"ఏమో బాబూ! నాకా ఓపిక లేదు" అనేసి విశాలాక్షి అక్కడ్నుంచి వెళ్లిపోయింది. లోపల ఏదో పనుందని...

ప్రమీల ఫ్రెండ్స్ ఫోన్‌లోనే అభినందనలు చెప్తున్నారు.

ఈ ఊర్లో విశాలాక్షికి పరిచయస్తులు చాలామందే ఉన్నారు. ఆమె క్రమం తప్పకుండా అన్ని దేవాలయాలకీ వెళ్తూ ఉంటుంది. అలాంటి చోట పరిచయమైన వాళ్లే బోలెడు మంది. పిలిచిన ప్రతీ పేరంటానికీ వెళ్తుంది అదికాక, అక్కడ మరికొంతమంది పరిచయ మైపోయారు. మరి బంధువుల సంగతి సరేసరి.

అదే పనిగా ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. అంత మంచి ఉద్యోగం చేస్తున్న కుర్రాడు అల్లుడిగా దొరికినందుకు అవతలివాళ్లు విశాలాక్షికి అభినందనలు చెప్తున్నారు. రాజశేఖరం కూడా పది రోజులు శెలవు పెట్టుకుని కలకత్తా నుండి వచ్చేసేడు విశాలాక్షికి.

ఒకటే హడావిడి. పెళ్ళి ఇంకా నాలుగు రోజులే ఉంది.

ఆ రోజు ఆడపడుచులిద్దరూ పిల్లల్ని తీసుకుని ఎవరో బంధువులింటికి వెళ్ళారు. ఆవిడ తమ్ముడి పెళ్ళాం పద్మ, చెల్లెలు పంకజం షాపింగ్‌కని వెళ్లారు. విశాలాక్షి లోపల పనిలో ఉంది.

ఫోన్ మోగింది. విశాలాక్షి ఆదరాబాదరాగా వచ్చి ఫోన్ ఎత్తింది.

"హలో! నేను కాత్యాయన్ని మాట్లాడుతున్నాను"

"ఓహో! మీరా కాత్యాయినీ! ఎప్పుడొచ్చారు ఊర్నుంచి? అన్నట్టు మీకో శుభవార్త. మా అమ్మాయికి అనుకోకుండా పెళ్లి కుదిరింది. నాలుగు రోజుల్లో పెళ్ళి! మీకు ముందు చెప్దామంటే మీరు వూర్లో లేరు. ఇన్నాళ్ళూ ఎక్కడికెళ్ళిపోయేరు?"

"మా పెద్దబ్బాయికి ఒంట్లో బాగులేదంటే వెళ్ళాను. మీ అమ్మాయి పెళ్ళి సంగతి ఇందాకే

తెల్సింది. సరేకాని మీ అల్లుడు ఎవరి... అబ్బాయి... అన్నారూ...?"

విశాలాక్షి చెప్పింది సంబరంగా.

ఒక్కక్షణం నిశ్శబ్దం!

విశాలాక్షికి అనుమానం వచ్చింది కాత్యాయిని ఫోన్ పెట్టేసిందేమోనని.

"హలో!" కాత్యాయిని గొంతు విప్పింది మెల్లగా.

"ఊఁ చెప్పండి"

"అది కాదు. మీరు... ఆ అబ్బాయిని సరిగ్గా చూసేరా?"

"అంటే...?"

"ఏం లేదు. మీరు ఆ అబ్బాయిని బాగా చూసేరా... అని అడుగుతున్నాను"

"అదేమిటి అలా అడుగుతున్నారు? నేను చూసేను. బాగానే ఉన్నాడే!" అంది విశాలాక్షి ఆశ్చర్యపోతూ.

"అబ్బే! ఏం లేదు. మీకెలా చెప్పాలో అర్థం కావడం లేదు. పెళ్లిపనులన్నీకూడా అయిపోయాయంటున్నారు. అందరికీ ఉత్తరాలు వ్రాసేసామంటున్నారు. పెళ్లి యింకా నాలుగు రోజులే ఉందంటున్నారు. ఇలాంటప్పుడు మీకా విషయం చెప్తే ఏమిటో చెప్పకపోతే ఏమిటో అని-"

"ఏ విషయం?" విశాలాక్షికి ముచ్చెమటలు పోసేస్తున్నాయి అప్పటికే.

"అదే... అయిందేదో అయిందిగానీ పెళ్ళికొడుకు విషయంలో మీరు తొందర పడకుండా. అబ్బాయిని మరోసారి బాగా చూసి అప్పుడు ఏ నిర్ణయానికైనా రావడం మంచిదేమోనని-" ఇంతకీ "అసలు సంగతేమిటో చెప్పండి కాత్యాయినీ ప్లీజ్..."

కాత్యాయిని చెప్పింది విన్నాక ఆమెకి పక్కలో బాంబు పడినట్టుగా, తన శక్తినంతా ఎవరో లాగేసినట్టుగా అనిపించింది.

"అయ్యో, అయ్యో: అలాగా?"... అని మనసులో అనుకున్నది కాస్తా చెవులకే వినిపించేసింది. నిస్సత్తువగా అయిపోయి అక్కడే నేల మీద చతికిలపడిపోయింది.

సరిగ్గా అప్పుడే పద్మ, పంకజం బజారు నుంచి వచ్చేరు. అక్కని ఆ స్థితిలో చూసి పంకజం గబగబా వచ్చి ఆమెని మెల్లగా నడిపించుకుని తీసుకువెళ్లి మంచం మీద పడుకోబెట్టి ఫోన్ చేసింది.

"అక్కా! ఏమయిందే? వూరికే అన్ని పన్లూ నెత్తిన వేసుకుంటావు. ఇంతమందిమి వున్నాము. అందరికీ తలా ఒక పని చెప్పొచ్చుగా. అనవసరంగా హైరానా పడిపోయి అలసటో ఆయాసమో తెచ్చుకుంటున్నావు. ఏదైనా పనుంటే మాకు చెప్పు, చేస్తాం. నువ్వు కదలకుండా రెస్టు తీసుకో"

పద్మ వేడి వేడి హార్లిక్స్ తీసుకొచ్చి ఆవిడ చేత తాగించింది. అప్పటికే యింట్లో వున్న మిగిలినవాళ్లు కూడా ఆమె చుట్టూ చేరారు. విశాలాక్షికి దుఃఖం తన్నుకొస్తోంది. ఆమె గొంతు వణుకుతోంది. మెల్లగా గొంతు పెగల్చుకుని "ఉండండర్రా. నాకేం అవలేదు గానీ-" అని ఇంకా ఏదో చెప్పాలని ఊపిరి లాక్కుంది.

వాళ్లంతా "నువ్వు మరేం మాట్లాడకు" అంటూ ఆమెని ఆపేసారు. విశాలాక్షికి కళ్లంట నీళ్లు ఆపుకోవడం కష్టమై పోతోంది.

మనిషి మీదా, మంచితనం మీదా వున్న నమ్మకంతో ఆమె అసలా విధంగా ఆలోచించలేక పోయింది! అలాంటి అనుమానం ఆమె మనసులోకి రానే లేదు.

గుండెల్లోంచి ఉప్పెనలా ముంచుకొస్తున్న దుఃఖాన్ని పెదవి చివర అదిమిపెట్టుకుని తనని తాను అదుపు చేసుకుంది. ఒకసారి చుట్టూ చూసింది. అందరూ ఆమె వైపే విచారమైన మొహాలతో చూస్తున్నారు. తను విన్న ఆ విషయం... అది నిజమే అయితే నిప్పు లాంటి ఆ నిజం... గట్టిగా అరచి అందరితో చెప్పాలని ఉంది!

"నేను ఆయనకి మీ బావగారికి ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి" అంది విశాలాక్షి, ఆందోళనగా. ఆవిడ లేచి వెళ్తూంటే అంతా స్థాణువులై ఉండిపోయేరు.

★ ★ ★

సీతాపతి ఆమె చెప్పింది విని తెల్లబోయేడు.

"ఇప్పుడెలా? పెళ్లికి అన్ని ఏర్పాట్లూ చేసేశామే"

"ఏం చేద్దాం?" అంది విశాలాక్షి బేలగా.

రాజశేఖరం అన్నాడు "నాన్నగారూ! అమ్మ చెప్పింది కన్‌ఫర్మ్ చేసుకోవాలంటే ఒకటే మార్గం ఉంది. మనం వెంటనే బయల్దేరి వరంగల్ వెళ్దాం. పెళ్లికి వారం రోజులు ముందుగానే పెళ్లికొడుకు తన అక్కగారి ఇంటికి వచ్చేస్తాడని అన్నారుగదా! ఈ పాటికి వచ్చేసే ఉంటాడు. మనం వెంటనే ఏ సంగతీ అక్కడే తేల్చుకుందాం... మిగిలిన నిర్ణయాలూ కార్యక్రమాలూ ఆ తరువాతనే!"

★ ★ ★

విశాలాక్షికి పిచ్చెక్కినట్టుగా ఉంది.

తను, తన కూతురు ఏం పాపం చేశారని విధి తమ జీవితాలతో యిలా ఆటలాడు తోంది!

శ్రీరస్తు మొదలు చిత్తగించవలెను వరకూ పెళ్లికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ జరిగిపోయేయి!

ఇప్పుడు "మనం విన్నది నిజమే. ఈ పెళ్లి కాన్సిల్ చేసేద్దాం" అన్నారు తండ్రీకొడుకులిద్దరూ వరంగల్ వెళ్ళి వచ్చి.

"ఇంత దాకా వచ్చేక యిప్పుడు పెళ్లి కాన్సిల్ అంటే ఎంత అవమానం! ఎంత డబ్బు నష్టం?" కోపంతో చిందులు తొక్కుతున్నాడు రాజశేఖరం.

"నిజాన్ని దాచిపెట్టి వాళ్లు మనల్ని మోసం చేసేరు!" అన్నాడు సీతాపతి బాధగా.

"అందుకేగాబోలు... సరిగ్గా పవర్‌కట్ టైమ్ చూసుకుని వచ్చేరు. కరెంటు వచ్చినదాకా వుండమంటే వుండకుండా పెద్ద పని వున్నట్టు వెళ్లిపోయారు!" ఆ రోజు జరిగింది గుర్తుకురాగానే నిరుత్సాహంగా, నిర్లిప్తంగా, అంతలోనే చిరాకుగా అంది విశాలాక్షి.

"పెళ్ళికొడుకేమో... ఉన్నదున్నట్టు చెప్పడం మంచిదనీ లేకపోతే వాళ్లని మోసం చేసినట్టు

అవుతుందనీ పాపం ఎంతో ఇదిగా చెప్పేడట. కాని వాళ్లక్క వాడి నోరు నొక్కేసిందట!" సీతాపతి అన్నాడు.

"జరిగిందేదో జరిగిపోయింది. ఈ పెళ్ళి ఆపేసి, మన ప్రమీలకి ఇంతకంటె అవమానం, కష్టం కలక్కుండా చూడడమే మనపని" శేఖరం ఖచ్చితంగా అన్నాడు.

అప్పుడు వచ్చింది ప్రమీల అక్కడికి.

ఆమె చేతిలో ఒక ఉత్తరం ఉంది.

ఆ ఉత్తరం పెళ్ళి చూపులకి ముందే కళ్యాణ్ ఆమెకి వ్రాసిన ఉత్తరం...

"అమ్మా!" తల్లి దగ్గరికొచ్చి కూర్చుంది, ప్రమీల.

"ఏంటమ్మా! చెప్పు తల్లీ! నీకంతా తెల్సిపోయే వుంటుంది ఈపాటికి. నీకు జరగరాని అవమానం జరిగిపోయింది. ఇంకానయం. ముహూర్తానికి ముందే తెలిసింది కనక కనీసం పెళ్లి ఆపగలుగుతున్నాం!"

"అమ్మా! ఈ పెళ్లి ఆపకండి... నేను ఆయన్నే చేసుకుంటాను."

అక్కడున్న ముగ్గురూ ఆమె నిర్ణయానికి చేష్టలుడిగినట్టుండిపోయేరు.

"ప్రమీలా! ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది? మతిగాని పోయిందా?" కస్సుమన్నాడు రాజశేఖరం. అలాంటివాడికిచ్చి పెళ్లి చేస్తే చెల్లెలు... జీవితంలో అస్సలు సుఖపడలేదని అతని ఆవేదన!

"అమ్మలూ! నువ్వు బాగా ఆలోచించేవా? అంతా తెలిసి వుండి..." దుఃఖంతో కూడి మరి మాట పెగల్లేదు సీతాపతికి.

ప్రమీల వాళ్ల మాటలకు ఏమాత్రం చలించ లేదు. "ఈ ఉత్తరం చదవండి. ఇందులో అతను చేసిన మోసమేమీ లేదు. పెళ్లిచూపులకి ముందే అతను నాకు వ్రాసిన ఉత్తరం యిది!"

ఉత్తరాన్ని తండ్రి చేతిలో పెట్టింది ప్రమీల.

సీతాపతి ఉత్తరం చదువుతూంటే విశాలాక్షి రాజశేఖరం కూడా ఆత్రుతని అణుచుకోలేక చెరొకవైపు నుంచొని ఉత్తరాన్ని చదవసాగారు.

"ప్రమీల గారూ!

నా ఉత్తరం చదివేక మీరు ఆశ్చర్యపోతారని, అసహ్యించుకుంటారని, మీకు బాగా కోపం వస్తుందని నాకు తెలుసు. అందుకే అక్క, బావ వారిస్తున్నా వినకుండా, వాళ్లకి తెలియకుండా వాస్తవాన్ని మీ ముందుంచాలనే సదుద్దేశ్యంతో నేనీ ఉత్తరం వ్రాస్తున్నాను.

ఏడాది క్రితం కారు ఏక్సిడెంట్‌లో కాలు పోగొట్టుకున్న నేను కృత్రిమమైన కాలుతో, జీవితంలో పోగొట్టుకున్న ఆనందాన్ని తిరిగి పొందగల్గేను. దేవుడు అందరికీ అన్నీ యివ్వడు. అన్నీ యిచ్చేస్తే మనం ఆ దేవుడ్ని మరిచి పోతామని ఆ దేవుడి భయం! జీవితం పంచుకోవాల్సిన వారి దగ్గర నిజాన్ని దాచిపెట్టడం నేరం అవుతుంది! అందుకే నేను ఆ విషయాన్ని ముందుగానే

తెలియజేస్తున్నాను. మీకు మనస్ఫూర్తిగా యిష్టమైతేనే నా జీవితంలోకి అడుగుపెట్టండి. "నిర్ణయం" తీసుకునే ముందు బాగా ఆలోచించు కోండి. ఈ ఉత్తరం మనం ఒకర్నొకరు చూసుకునే ముందే అందుతుంది కనుక మీ నిర్ణయాన్ని నాతో సహా ఎవరికైనా తెలియజేసే వ్యవధి ఉందని అనుకుంటున్నాను.

ఇట్లు
కళ్యాణ్.

ఆ ఉత్తరం వ్రాసే విధానాన్ని బట్టి, ఉత్తరంలో వున్న విషయాన్ని బట్టి చూస్తే, కళ్యాణ్ నిజాయితీ అద్దమంత స్పష్టంగా కనిపిస్తున్నది. పాపం విధి వంచితుడైన కళ్యాణ్ లాంటి వ్యక్తికి చేయూతనివ్వడం నిజంగా హర్షించదగ్గ విషయమే.

ప్రమీల అందరివైపు ఒకసారి చూసి నెమ్మదిగా అంది "నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చేను నాన్నగారూ! నా నిర్ణయాన్ని మార్చడానికి ఎవరూ ప్రయత్నించకండి. నా అదృష్టం బాగులేక రేపు 'పెళ్ళి' అయ్యాక అతనికి ఏక్సిడెంట్ అయి కాలు పోగొట్టుకుంటే మనమేం చెయ్యగలం చెప్పండి? నాకు ఆదర్శం అంటే ఏమిటో సరిగ్గా తెలీదు. అలాంటి పరిస్థితిలో వున్న వ్యక్తిని ఆదుకోవడానికి, మనోధైర్యం కల్పించడానికి, ఓదార్పు అందించడానికి నా జీవితాన్ని అంకితం చేయడంలో ఎంతో తృప్తి వుంటుందని నేను భావిస్తున్నాను. నా సుఖం, సంతోషం గురించి దిగులు పడవలసిన అవసంర లేదు. నేను సుఖంగానే ఉంటాను. నేనేదో త్యాగం చేస్తున్నానని అనుకోవడం లేదు. దయచేసి మీరు కూడా అలాంటి భావన మనసులోకి రానివ్వకండి. మన సమస్యకి పరిష్కారం యిదే. మంచితనాన్నే వూపిరిగా పీల్చుకుంటున్న మనలాంటి వాళ్లు తీసుకోవాల్సిన సరియైన నిర్ణయం యిదే నమ్మా!..." తల్లి వైపు తిరిగి అంది.

"మొదటి చూపులోనే ప్రేమించేం అంటారు కొందరు. నాకు అలాంటివి తెలీవు. నాది ప్రేమ కావచ్చు. అభిమానం కావచ్చు. లేదంటే బాధలోంచి ఎగిసిపడ్డ బలమైన నిర్ణయం కావచ్చు. ఏది ఏమైనా నా నిర్ణయం మాత్రం మారదు" ఆమె మాటలు దృఢంగా, ఖచ్చితంగా ఉన్నాయి.

★ ★ ★

***(చెలిమి, వీక్లీ ; 21-8-1999)***